క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు ప్రారంభం



ధాన్యం కాంటా ప్రారంభిస్తున్న డీసీవో

మాచారెడ్డి: మండల కేంద్రంలో నెలరోజులు పాటు నిలిచిన ధాన్యం కొనుగుళ్లు గురువారం తిరిగి ప్రారంభమయ్యాయి, ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు బుధవారం రోడ్డెక్కిన విషయం తెలిసిందే. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రాంమోహన్ మండల కేంద్రానికి వచ్చి కాంటాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 లారీల ధాన్యంను కాంటాలు చేసి రైసుమిల్లులకు తరలించినట్టు చెప్పారు. ఆయన వెంట జిల్లా సివిల్‌సప్లై అధికారి మల్లిఖార్జున్‌బాబు, అసిస్టెంట్ డీఎస్‌వో కేవైఎల్ నర్సింహ,డీటీ శ్రీనివాస్, మానిటరింగ్ అధికారి అమీర్‌ఖాన్, విండో కార్యదర్శి చంద్రారెడ్డిలు ఉన్నారు.

హుండీ లెక్కింపులో చేతివాటం : ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలి



సిద్ధరామేశ్వరాలయం సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

భిక్కనూరు: మండలంలోని సిద్ధరామేశ్వరాలయంలో హుండీ లెక్కింపులో చేతివాటం ప్రదర్శించి పట్టుబడ్డ ఎలక్ట్రీషియన్ బి. లక్ష్మీనారాయణపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల బీజేపీ నేతలు గురువారం ఆలయానికి తరలివెళ్లారు. అక్కడ ఆలయ ఈవో అందుబాటులో లేకపోవడంతో ఆలయ సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. సంఘటన జరిగి పదిరోజులు గడుస్తున్న సదరు ఉద్యోగి పై చర్యలు తీసుకోకపోవడం శోచనీయమని మండల బీజేపీ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని లేకుంటే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు నరేందర్‌రెడ్డి, తిరుమలేష్, వినయ్, యాదగిరిగౌడ్, శంకర్, ఏక్‌నాథ్ రంజిత్‌లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన



సంతాయిపేట్‌లో ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని సంతాయిపేట్‌లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ పరిశీలించారు. ప్రభుత్వం మండలంలోని సంతాయిపేట్ గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసిందని, లబ్ధిదారులు ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో తిరుగుతూ గ్రామంలో తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలని జీపీసిబ్బందిని సూచించారు.పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్నులను వసూలు చేయాలన్నారు. ఎంపీవో సవితారెడ్డి, హౌజింగ్ ఏఈ అశోక్,తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆయిల్ ఫామ్ పంట సాగు విధానంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రజాపతి తెలిపారు. ఈ పంట సాగు చేసుకోవడానికి ప్రభుత్వం నుంచి డ్రిప్‌కు రాయితీ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

గాంధారిలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో గురుకుల పాఠశాల మైదానంలో గురువారం ప్రీమియర్ క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించినట్లు మాజీ ఎంపీటీసీ సభ్యుడు తూర్పు రాజు తెలిపారు. ఈ టోర్నమెంట్‌లో పలువురు క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన యువకుడు చరణ్ రాజ్ చిత్రపటానికి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించినట్లు తెలిపారు.

పడకేసిన పారిశుధ్యం

- సమస్యలతో ప్రజలు సతమతం
- బిచ్కుంద, నస్రుల్లాబాద్ మండలాల్లో పరిష్కారం చూపని అధికారులు



హజ్జుల్‌లో కుళాయి నీటి కోసం క్యూలో బిందెలు



హజ్జుల్‌లో మురికి కాలువలు లేక పారుతున్న మురుగు

బిచ్కుంద(జుక్కల్)/నస్రుల్లాబాద్ : పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారింది. బిచ్కుంద, నస్రుల్లాబాద్ మండలాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో ప్రజా సమస్యలు పేరుకుపోతున్నాయి. ఒక్కో గ్రామంలో నీటి సమస్య, పారిశుధ్య సమస్యలతో ప్రజలు సతమతం అవుతున్నారు. బిచ్కుంద మండలం హజ్జుల్, మెక్కా, ఎల్లారం, బిచ్కుంద, శాంతాపూర్, దౌల్తాపూర్, ఖద్గాం ఆయా గ్రామాలలో తాగునీరు దొరకక, మురికి కాలువలు నిర్మించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దౌల్తాపూర్‌లో బోరుబావులు ఎండిపోయాయి. చుక్కనీరు రావడం లేదు. మిషన్ భగీరథ నీరు రంగుమారి ఎర్రగా వస్తున్నాయి. దుర్వాసన వస్తుండటంతో నీరు తాగలేకపోతున్నారు. దౌల్తాపూర్ ప్రజలు వ్యవసాయ బోర్లను ఆశ్రయిస్తున్నారు. నస్రుల్లాబాద్ మండలం బొప్పాస్ పల్లి గ్రామంలో ఎక్కడికక్కడ డ్రెయినేజీలు మురుగుతో నిండిపోయాయి. దోమలతో ఇబ్బందులు పడుతున్నారు. వీధులన్ని దుర్వాసనతో కంపుకొడుతున్నాయి. రెండు నెలలుగా సింగిల్ ఫేజ్ మోటారు కాలిపోవడంతో నీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ నీరు సైతం నీరు రావడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు.

నిధులు లేవు పనులు చేయం...

జీపీలకు పాలకవర్గం లేకపోవడంతో ప్రభుత్వం అవసరానికి తగిన నిధులు కేటాయించడం లేదు. తమ చేతిలో ఏమి లేదు నిధులు లేకపోవడంతో పనులు చేయమని ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు చేతులెత్తేస్తున్నారు.



బొప్పాస్‌పల్లిలో రోడ్డుపై పారుతున్న మురుగు



పాడైన బోరు మోటారు చూపిస్తున్న కాలనీవాసి

బోర్లు ఎండిపోయాయి



గ్రామంలోని బోర్లలో చుక్కనీరు రాక పూర్తిగా ఎండిపోయాయి. తాగునీటి కోసం ఎన్నో అవస్థలు పడుతున్నాం. మిషన్ భగీరథ నీరు ఎప్పుడు వస్తాయో తెలియదు. రంగుమారిన నీరు వస్తున్న నీళ్లు తాగలేకపోతున్నాము. కొత్త బోరు కోసం అధికారులు నిధులు లేవంటున్నారు.

–మహ్మద్ జలీల్, దౌల్తాపూర్ గ్రామం

సమస్యలు గుర్తించి పరిష్కరిస్తున్నాం

దౌల్తాపూర్‌లో కొత్త మోటారు బిగించాం. బోరు ఎండిపోయి నీరు రావడం లేదు. తాగునీరు ఇతర సమస్యలు గుర్తించి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నాను. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా మోటార్లు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించాం.

–గోపాల్, ఎంపీడీవో బిచ్కుంద

బోరు మోటారు పాడైంది

గ్రామంలోని ఏడో వార్డులో బోరు మోటారు పాడై నెలలు గడుస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. భగీరథ నీరు సైతం రావడం లేదు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

–లక్ష్మీబాయి, బొప్పాస్‌పల్లి

దోమల బెడద నెలకొంది



గ్రామంలో మురికి కాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమల బెడద నెలకొంది.బోరు మోటారు సైతం చెడి పోయింది. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలి.

– పుండ్యా నాయక్, బొప్పాస్‌పల్లి

'పది' టాపర్లకు సన్మానం



దోమకొండ ఎంపీడీవో కార్యాలయంలో విద్యార్థిని సన్మానిస్తున్న అధికారులు, సిబ్బంది

సదాశివనగర్/దోమకొండ/భిక్కనూరు/రాజంపేట : పదో తరగతి ఫలితాల్లో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థులను సన్మానించారు. సదాశివనగర్ మండలం కల్వరాల్ ఉన్నత పాఠశాలకు చెందిన భవిక(581) ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ రెడ్డి, వీడీసీ ప్రతినిధులు సన్మానించి అభినందించారు. దోమకొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న రాధిక పదో తరగతి ఫలితాల్లో 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచారు. దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న మహమ్మద్ షరీఫ్ కూతురు సుమయ పదో తరగతి ఫలితాల్లో 566 మార్కులు సాధించగా, గురువారం మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. భిక్కనూరు మండలం కాచాపూర్‌కు చెందిన విఘ్నేశ్‌గౌడ్ పది ఫలితాల్లో 578 మార్కులు సాధించారు. దీంతో భిక్కనూరు చైతన్య విద్యానికేతన్‌లో కరస్పాండెంట్ భూర్ల రేణుకుమార్,హెచ్‌ఎం అశోక్‌యాదవ్ ఘనంగా సన్మానించారు. అలాగే జంగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సహస్ర (576) మార్కులు సాధించడంతో హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయుడు గఫూర్ శిక్షక్‌లు శాలువ, మెమెంటోతో సత్కరించారు. రాజంపేట కేజీబీవీ పాఠశాలకు చెందిన విద్యార్థులు గుర్రాల వర్షశ్రీ (552), పిట్ల నిహారిక (545) మార్కులు సాధించడంతో గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ఆమిదాల రమేష్ వారిని శాలువతో సత్కరించారు.

కామారెడ్డి బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

కామారెడ్డి అర్బన్: పదో తరగతి పరీక్షల్లో కామారెడ్డి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్టు హెచ్‌ఎం రమణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలకు సంబంధించి 45 మంది విద్యార్థులకు 12 మంది 500లకు పైగా సాధించార న్నారు. కమ్మరి స్పందన 565, ఆలే మానస 559, ఉమాశ్రీ 553 మార్కులు పొందినట్టు హెచ్‌ఎం పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం



ఇసన్నపల్లిలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

భిక్కనూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని మెదక్ జిల్లా రామాయంపేట ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు యాదగిరి, స్వామిలు భిక్కనూరు మండలం ఇసన్నపల్లి గ్రామంలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు.ప్రభుత్వ కళాశాలలో చదివితే ఉచిత పుస్తకాలు,ఉపకార వేతనాలు అందుతాయని నాణ్యమైన విద్య లభిస్తుందని ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

పీహెచ్‌సీ తనిఖీ



మాట్లాడుతున్న వైద్యులు సాయి ఈశ్వరి

భిక్కనూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రిని కామారెడ్డి రాజీవ్‌నగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు సాయి ఈశ్వరీ గురువారం సందర్శించారు.ఆస్పత్రిలో వసతులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు సిబ్బంది పనితీరు గురించి రోగులతో మాట్లాడి వివరాలను సేకరించారు. ప్రజలకు అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్నారు. భిక్కనూరు వైద్యురాలు యెమిమా, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, స్టాఫ్ నర్సు హరిత, ఫార్మసీ ఆఫీసర్ స్వామి,ల్యాబ్ టెక్నీషియన్ వనశ్రీలు ఉన్నారు.

ప్రమాదకరంగా మారిన కల్వర్టు



చందాపూర్ శివారు రహదారిలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

పట్టించుకోని అధికారులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని చందాపూర్ గ్రామశివారు రహదారిలో కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కల్వర్టును నాసిరకంగా కట్టడంతో శిథిలావస్థలో చేరి సిమెంటు, కంకర, ఇనుపరాడ్లు తొలగిపోయి గుంత ఏర్పడింది. ఈరహదారిపై వేలాది వాహనాలు వెళ్తుంటాయి. దగ్గరకు వచ్చేంత వరకు గుంత కనిపించకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

సంక్షిప్తం

కంటి వైద్యశిబిరానికి స్పందన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. 85 మంది పరీక్షలు చేయించుకున్నారు. కంటి సమస్య ఉన్నవారికి శస్త్ర చికిత్స చేయిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య నిపుణులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘం నూతన కార్యవర్గం

దోమకొండ: మండలంలోని ముత్యంపేట గ్రామ రెడ్డి సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడుగా పబ్బతి సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులుగా తాటిపల్లి ఎల్లారెడ్డి, కోశాధికారిగా వంగ తిరుపతిరెడ్డి, కార్యదర్శిగా చీకోటి మహేందర్ రెడ్డి, అకౌంటెంట్‌గా నాయిని నరేష్ రెడ్డి, తదితరులను ఎన్నుకున్నట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. సంఘం అభివృద్ధికి కృషి చేస్తామని వారు తెలిపారు.

కేసీఆర్‌పై మాట జారితే ఊరుకోం



నస్రుల్లాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి రవీంద్ర భారతిలో మాట్లాడిన మాటలు సరికావని బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేసీఆర్ పై మాట జారితే ఊరుకోబోమన్నారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలన్నారు. కార్యక్రమంలో నర్సింలు గౌడ్, టి.సాయిలు, రాథోడ్, రాజు, డి.సాయిలు, లక్ష్మణ్ అఫ్రోజ్ తదితరులున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాలను పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్య సిబ్బంది శ్రీనివాస్ తెలిపారు. గురువారం మండలంలోని కాటేపల్లి గ్రామంలో పశువులకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 187 ఆవులకు,207 గేదేలకు గాలికుంటు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్,గాండ్ల పోచన్న, గోపాల మిత్ర సిబ్బంది, రవి రైతులు పాల్గొన్నారు.

తడి పొడి చెత్త సేకరణతో మహిళలకు ఉపాధి



దోమకొండలో మాట్లాడుతున్న సురేందర్

దోమకొండ: తడిపొడి చెత్త సేకరణ ద్వారా మహిళలకు ఉపాధి లభిస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్ అన్నారు. గురువారం దోమకొండ గ్రామపంచాయతీ పరిధిలో వ్యర్థపదార్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేయుటకు సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దోమకొండ గడికోట ట్రస్టు సహకారంతో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రం నిర్మించుటకు ప్రభుత్వంతో పాటు దోమకొండ ట్రస్ట్ సహకారంతో కేంద్రం నిర్మించి ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ కేంద్రం ఏర్పాటు చేసి ఆదర్శ మండలంగా తయారు చేయడానికి ప్రణాళిక తయారు చేస్తున్నట్లు వివరించారు. వివిధ మండలాల వారికి ఆదర్శంగా నిలవడానికి ఇది ఉపయోగపడుతందన్నారు. గ్రామంలోని డ్వాక్రా మహిళలకు దీని ద్వారా ఉపాధి కలుగుతుందన్నారు. కేంద్రం ఏర్పాటు కోసం పని అంచనా విలువ వేయుటకు సంబంధిత శాఖ ఇంజినీర్‌తో సమావేశం నిర్వహించమన్నారు. సమావేశంలో పంచాయితీ రాజ్ డిప్యూటీ ఇంజినీర్ దుర్గాప్రసాద్, పంచాయతీరాజ్ డిప్యూటీ ఈఈ స్వామిదాస్, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, గడికోట ట్రస్టు మేనేజర్ బాబ్జీ, పంచాయతీ కార్యదర్శి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మురికి కాలువ పూడ్చి ట్యాప్ ఏర్పాటు చేసిన అధికారులు



ట్యాప్ ఏర్పాటు చేసిన పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని బొప్పాస్ పల్లి గ్రామంలో 'మురికి కాలువలో పైపు లైన్ 'అనే శీర్షిక గురువారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. మురికి కాలువ పక్కన మురికి గుంటను శుభ్రం చేసి ట్యాప్ ఏర్పాటు చేయాలని ఎంపీడీవో సూర్యకాంత్ సంబంధిత పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఆదేశాల మేరకు గ్రామ పంచాయతి సిబ్బంది మురికి కాలువలో మొరం పోసి ట్యాప్‌ను ఏర్పాటు చేశారు.

'చెరువు కట్టపై ముళ్ల తొలగింపు బాధ్యత మున్సిపల్‌దే'

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి 'వారసత్వ చెరువు–నోచుకోని అభివృద్ధి' అనే శీర్షికన ఏప్రిల్ 15న ప్రచురితమైన కథనానికి గురువారం నీటిపారుదల శాఖ డివిజన్ ఈఈ ఎస్.వెంకట నర్సింహరావు స్పందించారు. చెరువు కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఉన్నందున కట్టపై ఉన్న ముళ్ల చెట్ల తొలగింపు వారే చూసుకోవాలని, నీటిపారుదల శాఖకు ముళ్ల చెట్ల తొలగింపు సాధ్యం కాదని స్పష్టం చేశారు. మున్సిపల్ నిధులతో ముళ్ల చెట్ల తొలగింపు చేయాలని సూచిస్తూ ఉత్తరం రాసినట్టు ఈఈ పేర్కొన్నారు. అలాగే చెరువు కట్టపై మందుబాబుల ఆగడాలను అరికట్టడానికి పెట్రోలింగ్ నిఘా కోసం పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. చెరువు కట్ట కుంగుబాటు, పగుళ్ల పనులు చేపట్టడానికి నిధుల కోసం అంచనాలు రూపొందించినట్టు, మంజూరు కాగానే పనులు చేపడుతామని ఆయన వివరించారు.

నీటితొట్టె పరిసరాలు పరిశుభ్రం



పరిసరాలను పరిశీలిస్తున్న కార్యదర్శి

బాన్సువాడ రూరల్: మండలంలోని హన్మాజీపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని సంగ్రామ్‌తండాలో నీటితొట్టితో పాటు పరిసరాలను బుధవారం పంచాయతీ కార్యదర్శి రాజేష్ శుభ్రం చేయించారు. ఏప్రిల్ 30న పరిసరాలు ఇలా..వ్యాధులు రావద్దంటే ఎలా.. అనే శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. రోడ్డుపై నుంచి మురికి నీరు పారకుండా కాలువతీశారు. తండావాసులు నీటితొట్టి వద్ద మురుగు బట్టలు ఉతకరాదని పంచాయతీ కార్యదర్శి సూచించారు. ఆయన వెంట కారోబార్ దత్తు ఉన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యకాంత్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీవో సూర్యకాంత్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలో శానిటేషన్ పనులు పూర్తి చేయాలన్నారు. నీటి సమస్య లేకుండా చూసి, ఉపాధి హామీ పనుల కల్పన, రేషన్ కార్డు సర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. నూతనంగా ఏర్పాటైన ఫకీరా నాయక్ తండా,సంగం(ఏ) గ్రామాల్లో గ్రామ పంచాయతీ భవనాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీల సంరక్షణ చేపట్టాలి



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీవో నరేశ్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బాణాపూర్ తండా, కొర్పోల్ గ్రామాల్లోని నర్సరీలను సంరక్షించాలని ఎంపీడీవో నరేశ్ సూచించారు. గురువారం ఆయన ఆయా గ్రామాల్లో నర్సరీలు, ఉపాధి హామీ పనులు, పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీల్లోని మొక్కలకు ప్రతి రోజు నీరు పోయాలని సూచించారు. ఉపాధి పనుల్లో కూలీలు ఎక్కువ మంది పాల్గొనేలా చూడాలన్నారు. గ్రామాల్లోని మురికి కాల్వల్లో పూడిక తీయాలని గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉపాధి సిబ్బందికి సూచించారు. ఆయన వెంట క్షేత్ర సహాయకుడు కాళీదాసు, కార్యదర్శులు ఉన్నారు.

ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం



నినాదాలు చేస్తున్న నాయకులు

భిక్కనూరు: జనగణనతో పాటు కులగణన చేయాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో గురువారం ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చిన్నోళ్ల శంకర్, బీజేపీ మండలాధ్యక్షుడు ఉప్పరి రమేష్, ప్రధానకార్యదర్శి తిరుమలేష్,,నేతలు నరేందర్‌రెడ్డి, అరిగే నర్సింలు, యాదగిరిగౌడ్, ఏక్‌నాథ్, రంజిత్, మెట్టు స్వామి, వినయ్‌లు పాల్గొన్నారు.

నీటి ఇబ్బందులు లేకుండా చూడాలి

ఎల్లారెడ్డి: మున్సిపల్ పరిధిలో నీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. వార్డులలో నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ సర్వే సక్రమంగా చేయాలన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ మహేష్‌కుమార్